క్లుప్తంగా

నిల్వనీటితో వ్యాధుల ముప్పు



లక్ష్మీనగర్ వద్ద నిల్వ నీరు పారబోస్తున్న సిబ్బంది

జగదాంబ: ఇల్లు, పరిసరాల్లో నిల్వ నీరు ఉంచరాదని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ సూచించారు. జీవీఎంసీ 35వ వార్డులోని వెలంపేట, లక్ష్మీనగర్, ఉడ్‌యార్డు స్ట్రీట్, రామకృష్ణా నగర్ ప్రాంతాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా జ్వరాలకు దోమలే కారణమన్నారు. ఇళ్లలో, తాగి పడేసిన కొబ్బరిబొండాల్లో, పాత టైర్లు, ఫ్రిజ్ వెనుకభాగంలో ఉండే నీటిలో దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. ఆ నీటిని ఎప్పటికప్పుడు తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు చెక్ పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

నేడు అవగాహన సదస్సు

కంచరపాలెం : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు తయారీ, సేవా పరమైన యూనిట్లు ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి తెలిపారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఐటీఐఎటీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఉందన్నారు. ఆసక్తి గల అర్హత అభ్యర్థులు kvic onine.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకొని సదస్సు రావాలని కోరారు.

ప్రత్యేక ప్రసంగం నేడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం ప్రత్యేక ప్రసంగం కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో విద్యార్థులనుద్దేశించి సెంట్రల్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్(జీవోసీ–ఇన్–సీ) లెఫ్టినెంట్ జనరల్ ఎస్.ఎస్.రాజ సుబ్రమణి 'అమృత్‌కాల్ విజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ'అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆయన పాల్గొంటారని తెలిపారు. ముందుగా లెఫ్టినెంట్ కల్నల్ సుబ్రమణి ఏయూలో పరిపాలన భవనంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో కొద్ది సేపు సమావేశమవుతారు.

నేత్రదాన ఆవశ్యకతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సెలర్లు

సీతంపేట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పి.విశ్వామిత్ర ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో 'నేత్రదానం –ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నేత్ర వైద్యశాఖ సిబ్బంది, ఐ డొనేషన్ కౌన్సిలర్లు 9, 10 తరగతి విద్యార్థులకు నేత్రదానం ఆవశ్యకతను వివరించారు.

వటపత్రశాయిగా.. వేంకటేశ్వరుడిగా..



వటపత్ర శాయిగా..



వివిధ రూపాల్లో గణనాథుడు



వేంకటేశ్వరస్వామిగా..

- విభిన్న రూపాల్లో సిద్ధమవుతున్న గణనాథులు
- విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు
- మట్టి ప్రతిమలకు పెరుగుతున్న ప్రాధాన్యం

డాబాగార్డెన్స్: వినాయక చవితి సమీపించడంతో అంతటా సందడి మొదలైంది. వచ్చే నెల 18 నుంచి గణపతి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానుండటంతో బొజ్జ గణపయ్యలను కొలువుదీర్చి, అర్చించేందుకు కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా వివిధ రూపాల్లో గణనాథుల విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. ఉత్సవ కమిటీలు తమకు కావాల్సిన మోడల్, సైజును బట్టి ఆర్డర్లు ఇస్తున్నారు. మరోవైపు విగ్రహాల తయారీలో వినియోగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాల వల్ల పర్యావరణానికి కలిగే హాని గురించి వివరిస్తూ మట్టి ప్రతిమలనే పూజించాలని పర్యావరణ వేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

పర్యావరణ హితంగా..

కోల్‌కత్తా, ఒడిశా, భద్రక్ తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొంతమంది కళాకారులు పాత నగరంలో, కంచరపాలెం, ధర్మానగర్, రామ్మూర్తి పంతుల పేట, పాత పోస్టాఫీస్, మధురవాడ ఎస్‌బీఐ పక్కన విగ్రహాలు తయారు చేస్తున్నారు. వీరు కేవలం మట్టి విగ్రహాలు మాత్రమే తయారు చేస్తున్నారు. రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తూ, భక్తులను ఆకర్షించే విధంగా విగ్రహాలను రూపొందిస్తున్నారు. సాధారణంగా వినాయక విగ్రహాలను వైట్ సిమెంట్ అచ్చుల్లో వేసి తయారు చేస్తారు. వీరు చేత్తోనే వివిధ ఆకారాలతో మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం.

భద్రక్ నుంచి వచ్చి..

ఒడిశాలోని భద్రక్ కళాకారుడు కార్తీక్ తయారు చేసిన విగ్రహాలకు గిరాకీ బాగా ఉంది. ఆర్డర్లు బట్టి మూడు అడుగుల నుంచి 20..30..40..50 అడుగుల పైన ఎత్తు ఉండే విగ్రహాలను వివిధ రూపాల్లో చేస్తుంటాడు. నాలుగు దశాబ్దాలుగా విశాఖ నగర ప్రజలకు కార్తీక్ సుపరిచితుడే. గణపతిని పలు దేవతల రూపంలో తీర్చిదిద్దడం ఇతని ప్రత్యేకత. కార్తీక్ వద్ద విగ్రహం తయారు చేయించాలంటే రెండు నెలల ముందుగానే బుక్ చేయాల్సినంత డిమాండ్ ఉంది.

మట్టి విగ్రహాలకు డిమాండ్



భక్తులు మట్టి విగ్రహాలనే కోరుకుంటున్నారు. వీటి తయారీకి చాలా సమయం పడుతుంది. ఇప్పటికే తయారు చేసిన విగ్రహాల్లో 70 నుంచి 80 శాతం ఆర్డర్లు వచ్చాయి. చిన్నప్పటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాను. పండగ సమయంలో కుటుంబాన్ని విడిచి నెలల తరబడి ఉండాలి. మూడు నెలల ముందుగానే ఒడిశా భద్రక్ నుంచి కళాకారులు రప్పించి వారికి మూడు పూటలా భోజనం పెట్టి, వారి కుటుంబాలకు ఎంతో కొంత డబ్బులిచ్చి పంపించాలి. ముడి సరకులను అప్పు చేసి కొనుగోలు చేస్తాం. ఈ విగ్రహాలన్నీ విక్రయ ఆదాయంతోనే ఏడాది పొడవునా బతుకుతాం. – కార్తీక్, విగ్రహాల తయారీదారు

ఎమ్మెల్యే వాసుపల్లి వితరణ



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గృహసారథులు, చిరు వ్యాపారస్తుల కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. 27వ వార్డుకు చెందిన ఏడుగురికి ఆర్థిక సాయం అందించారు. గ్రీవెన్స్‌లో సమస్యలు పరిష్కరించే దిశగా అశోక్ నగర్‌లోని బాధితుల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులకు ఆర్థిక సహకారం అందించారు. ఏడుగురికి రూ.17,500 సాయం అందజేశారు. లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వర రెడ్డి, శ్రీనగర్ పెద్దలు ఎ.శివాజీ, ఇ.సింహాద్రి, ఇ. మధు, గణపతి, పి.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారానికి 12వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా పంపించిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణ లక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల నటీనటులతో కొత్త చిత్రం



సమావేశంలో మాట్లాడుతున్న రాము గుడివాడ

డాబాగార్డెన్స్: రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నూతన నటీనటులతో ప్రొడక్షన్ నెంబర్–1 చిత్రాన్ని నిర్మిస్తామని ప్రొడ్యూసర్, డైరెక్టర్ రాము గుడివాడ తెలిపారు. షూటింగ్ విశాఖ పరిసర ప్రాంతాల్లోనే జరుగుతుందన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్శకుడు వీరు.కె వద్ద మెలకువలు నేర్చుకుని, స్వయంగా ఆర్‌జీ క్రియేషన్స్ అనే చిత్ర నిర్మాణ సంస్థను స్థాపించి సినిమా రంగంలోకి అడుగు పెట్టానని తెలిపారు. ఆడిషన్స్ నిర్వహించి నూతన నటీనటులను ఎంపిక చేశామన్నారు. లవ్ అండ్ కామెడీ, ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందని, సింగిల్ షెడ్యూల్‌లో 30 రోజుల్లో సినిమా పూర్తి చేస్తామని చెప్పారు. ప్రొడక్షన్ నెంబరు–2 చిత్రాన్ని కూడా త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. వచ్చే నెల 19 నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని, ఈ లోపు ఎంపిక చేసిన నటీనటులకు వర్క్‌షాప్ ఉంటుందని తెలియజేశారు. ఈ రెండు చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, మాటలు, పాటలు, నిర్మాత, దర్శకత్వం తానే నిర్వహిస్తున్నట్టు రాము తెలిపారు. సమావేశంలో పసుపులేటి గోపీనాథ్, బంగారు ప్రకాష్, రవితేజ, జి.మురళి, జి.లక్ష్మణ్, డి.అర్జున్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని రైతుల ఆందోళన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన రైతులు

సీతమ్మధార: జీవీఎంసీ ఇరవై ఏళ్ల క్రితం తారురోడ్డు నిర్మించి నేటి వరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదని విజయనగరం జిల్లా రైతు సంఘాల ప్రతినిధులు తెలిపారు. వెంటనే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మధుపాడ, ముసిడిపల్లి , చినకండెపల్లి, విశ్వనాథపురం, భీమవరం, కృష్ణాపురం, తదితర గ్రామాల ప్రజలకు విజయనగరం, ఎస్.కోటలకు రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బంది కలుగుతుందన్నారు. సుమారు ఐదు కిలోమీటర్లు రోడ్డు పూర్తిగా పాడైందన్నారు. జీవీఎంసీ అధికారులకు మొరపెట్టుకున్నా సమస్య పరిష్కరించలేదన్నారు. తాటిపూడి రిజర్వాయర్ నీళ్ల అమ్మకం చేస్తూ జీవీఎంసీ అధికారులు రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్‌కు స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంగారావు, రైతులు పాల్గొన్నారు.

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం


- ఆ విధంగా సిలబస్ రూపకల్పన అవసరం
- ఆధునిక సాంకేతికత విద్యార్థులకు చేరువ చేయాలి
- బీవోఎస్ సమావేశంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతో పాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలిచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన విద్య విధానం–2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఎస్.కె. భట్టి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి



కరస్పాండెంట్ కమలాదేవిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

బీచ్ రోడ్డు: విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకుని, సమయపాలన పాటించాలని స్పెషల్ ఎకనామిక్ జోన్ డిప్యూటీ జాయింట్ కమిషనర్ కె.రోషిని అన్నారు. సోమవారం ఆల్ సెయింట్స్ స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 50 ఏళ్లగా నగరంలో విశేష సేవలందిస్తున్న ఆల్ సెయింట్స్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ వి.కమలాదేవిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీతంతో పాటే నైట్ అలవెన్స్

ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు దామోదరరావు

అల్లిపురం: ఆర్టీసీ ఉద్యోగులకు త్వరలో ఓటీ, నైట్ అలవెన్స్‌లు ప్రతీ నెలా జీతంతోపాటే చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర నాయకుడు వలిశెట్టి దామోదరరావు తెలిపారు. ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్, విశాఖ, అనకాపల్లి జిల్లాల ఉమ్మడి విస్తృత స్థాయి సమావేశం సోమవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ ట్రీట్‌మెంట్ విషయంలో గతంలో మాదిరిగా కార్పొరేట్ వైద్యం, కార్పొరేషన్ భరించే విధంగా మళ్లీ పునరుద్ధరించే విధంగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నందమూరి రామారావు విశాఖ, అనకాపల్లి జిల్లాల అధ్యక్షులు కేఎస్ఎస్ మూర్తి, డీఎల్.రాజు, విజయనగరం జోన్ జోనల్ అధ్యక్షుడు కేజే శుభాకర్, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, రాష్ట్ర మెయింటినెన్స్ కమిటీ సభ్యుడు జి.శ్రీనివాసరావు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శి కే శ్రీనివాసరావు, డీఎస్ఎన్ మూర్తి, జోనల్ నాయకులు, ఏడు డిపోల అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన ఐపీఆర్ ఆన్‌లైన్ కోర్సు



ముగింపు సదస్సులో ప్రసంగిస్తున్న ఆచార్య పురుషోత్తం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ముగిసింది. ఆరు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో విద్యార్థులకు మేధోహక్కులు, పేటెంట్‌లపై విస్తృతమైన అవగాహన కలిగించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 210 మంది విద్యార్థులకు ఐపీఆర్ కేంద్రం చైర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం దిశానిర్దేశం చేశారు. మేధోహక్కులను వాణిజ్య ఉపయుక్తంగా మలచుకునే విధానాలను వివరించారు.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవం

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవం సోమవారం వైభవంగా ప్రారంభమైంది. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు ఈ వేడుకలు జరగనున్నాయి. విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్, వైదిక విపంచి, శ్రీవారి సేవ టీమ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన వేడుకలో ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పవిత్రోత్సవ అంకురార్పణ, సహస్రనామార్చనతో పాటు స్వామికి దశ హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కిరణ్మయి నృత్యాలయం బృందం సంప్రదాయ నృత్యాలతో అలరించింది. ఈ సందర్భంగా విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్ ప్రతినిధి హిమాంశుప్రసాద్ మాట్లాడుతూ తిరుపతిలో జరుగుతున్న తిరుమల పవిత్రోత్సవాలను పురస్కరించుకుని విశాఖలోనూ శ్రీవారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శ్రావణం నక్షత్రం పురస్కరించుకుని శ్రీవారికి పవిత్ర సమర్పణ, వస్త్ర సమర్పణ, అభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత

మేయర్ గొలగాని హరి వెంకటకుమారి



బస్సు దిగి జీవీఎంసీకి నడిచి వస్తున్న మేయర్

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయినందున, వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీతమ్మధార: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ అధ్యక్షుడు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ, అమ్మకం ఆపివేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ కార్మికులను శాశ్వత కార్మికులుగా పరిగణించి క్రమ బద్ధీకరించాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ వీధి విక్రయదారులకు 2014 చట్టాన్ని వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మి, తిరుపతిరావు, సి.హెచ్.వెంకట్రావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి కె.నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ అధికారులు పాత విధానాలు విడనాడాలి'



ధర్నాలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

అల్లిపురం: ఆర్టీసీ అధికారులు పాత విధానాలు విడనాడాలని పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కేవీ బాబు అన్నారు. చిన్న చిన్న తప్పులకు కూడా నెలల తరబడి డ్యూటీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రీజనల్ మేనేజర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 52వేల మంది ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. కొంతమంది తనిఖీ అధికారులు చెకింగ్ విధానంలో కావాలని తప్పుడు అభియోగాలు మోపి కండక్టర్లు, డ్రైవర్లను భయపెట్టి బలవంతగా వారికి నచ్చినట్లు కేసులు రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్, ఫిల్మ్ ఎడిటింగ్, డబ్బింగ్, వోకల్, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్ తదితర పీజీ డిప్లమా, డిప్లమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ సంస్థలో సంయుక్తంగా సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పదో తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చన్నారు.

కోర్సుల వివరాలు

ఆడియో ఇంజనీరింగ్–మ్యూజిక్ ప్రొడక్షన్ కోర్సులో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, డిప్లమాకు రూ.50 వేలు, పీజీ డిప్లమాకు రూ.1.5 లక్షలు ఫీజుగా ఉంటుందన్నారు. ఫిల్మ్ ఎడిటింగ్–డబ్బింగ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.30 వేలు, వోకల్ ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో సర్టిఫికెట్ కోర్సుకు రూ.20 వేలు, డిప్లమాకు రూ.35 వేలు, పీజీ డిప్లమాకు రూ.70 వేలు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పరిమిత సంఖ్యలో సీట్లు ఉంటాయన్నారు. ఆడియో ఇంజనీరింగ్‌లో 50 మందికి, ఫిల్మ్ ఎడిటింగ్‌లో 25 మందికి, ఇనుస్ట్రుమెంటల్ మ్యూజిక్‌లో 50 మందికి ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో సెప్టెంబర్ 11వ తేదీలోగా అందించాలని, 14న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు www.audoa.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.